క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి. అరుణ



ప్రత్తిపాడు: వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు బారిన పడకుండా ఉండవచ్చని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ వి. అరుణ అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా గొట్టిపాడులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, తల్లుల గృహాలకు వెళ్లి వారికి వ్యక్తిగత పరిశుభ్రతపై వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు చేతులను కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని చెప్పారు. చిన్నారుల ఎత్తు, బరువులపై ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పి.కుసుమ, వెంకటరమణ పాల్గొన్నారు. చినకోండ్రుపాడు సెక్టార్ పరిధిలోని గంగమ్మతల్లి గుడి సెంటరు అంగన్‌వాడీ కేంద్రంలోనూ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అత్యధిక పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవచ్చని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా పనిచేయాలి

గుంటూరు వెస్ట్: క్వారీలు, స్టోన్ క్రషర్స్‌లో పని చేసే కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డ్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సొసైటీ జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక లక్ష్మీపురంలోని హోటల్లో భద్రతా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కార్మికుల భద్రత కోసం డీజీఎంఎస్ హైదరాబాద్ రీజన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా క్వారీ, స్టోన్ క్రషర్ యజమానులు కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలన్నారు. వారికి పని చేసే చోట ఫస్ట్ ఎయిడ్‌తోపాటు ప్రమాదాలు జరిగిన వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భారత ప్రభుత్వం కార్మికుల కోసం అనేక ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందన్నారు. సమావేశంలో డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సొసైటీ సుప్రియా చక్రవర్తి, ఐఐటీ శాస్త్రవేత్తలు డాక్టర్ దేబరేష్ చక్రవర్తి, డాక్టర్ బిస్వజిత్ పాల్గొన్నారు.

సైకిల్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ప్రమాదవశాత్తూ సైకిల్ నుంచి జారిపడి వ్యక్తి తీవ్ర గాయాలతో మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. జేకేసీ కళాశాల రోడ్డులో నివాసం ఉంటున్న చెరుకూరి సుబ్బారావు(50) ఫోటో ఫ్రేమ్ వర్క్ చేస్తున్నారు. సాయంత్రం జేకేసీ కాలేజ్ రోడ్డులో సైకిల్‌పై వస్తూ కిందపడ్డాడు. తలకు తీవ్రగాయం కావటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించి, మృతుని బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడిని గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్ : యువకుడిని గాయపరిచిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేటలో నివసించే మేరుగ పండు బాజారుకు వెళ్లి వస్తుండగా పరిచయం ఉన్న నాగరాజు వచ్చి మా అబ్బాయిని ఎందుకు చెడగొడుతున్నావు పండు తలను ఆటోకేసి కొట్టాడు. దీంతో పండు తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హనుమయ్యనగర్ 1వలైనులో నివాసం ఉండే బాణాల బాలభాస్కర్ (29) మనస్పర్థల కారణంగా భార్యతో విడిపోయి ఒంటరిగా నివశిస్తున్నాడు. మంగళవారం బాలభాస్కర్ ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించి...

అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతిచెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదిత్యనగర్ 1వలైనులో నివశించే గుంటి దీపక్ (46) వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. మనస్పర్థల కారణంగా భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్నాడు. ఈనెల 4న అతిగా మద్యం సేవించి రోడ్డుపై పడి ఉంటే సోదరుడు దిలీప్ దీపక్‌ను ఇంటి వద్ద దింపి వెళ్లిపోయాడు. దీపక్ మంగళవారం ఉదయం ఇంటి వెలుపల మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి దిలీప్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రత్తిపాడులో ఎస్‌బీఐ బ్రాంచిలో ఉపాధ్యాయులకు సన్మానం



మలినేని కళాశాలలో సోషల్ వెల్ఫేర్ వసతిగృహాల కార్య నిర్వాహకురాలు పద్మజకు సత్కారం



కిట్స్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న చైర్మన్ కోయి సుబ్బారావు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించిన సచ్చిదానందశాస్త్రి



కేర్ డెంటల్ కళాశాల చైర్మన్ సయ్యద్ రసూల్ దంపతులకు సన్మానం

గురువులకు వందనం

ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

ప్రత్తిపాడు: తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్ ప్రారంభమవుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వి. రమాదేవి అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నలుగురు ఉపాధ్యాయులు జి. చంద్రశేఖర్ రెడ్డి (ఎల్ఈ కొండేపాడు), షేక్ హుస్సేన్ సాహెబ్ (ఎల్ఈ, కోయవారిపాలెం), జి. రవికుమార్ (ఎంపీపీఎస్ రావిపాటివారిపాలెం), శ్రీసుధ (ఎంపీపీఎస్, రావిపాటివారిపాలెం)లను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా సోషల్ వెల్ఫేర్ వసతి గృహాల కార్య నిర్వాహకురాలు కె.పద్మజ, చైర్మన్ మలినేని పెరుమాళ్లు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పద్మజ మాట్లాడుతూ తల్లిదండ్రుల తరువాతి స్థానం ఆచార్యులదేనన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాస కుమార్ పాల్గొన్నారు.

కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో..

మండలంలోని వింజనంపాడు కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో గురుపూజోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా యూకో బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పరిమి సురేష్, చీఫ్ మేనేజర్ వైఎస్‌వీఎస్ శర్మలు హాజరయ్యారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావుతో కలిసి కళాశాలలోని సీనియర్ అధ్యాపకులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ సూపరింటెండెంట్ వాసవి, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ముని చంద్రారెడ్డి, కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. హరిబాబు పాల్గొన్నారు.

సీడీపీవో కార్యాలయంలో..

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీచర్స్ డేను పురస్కరించుకుని ప్రత్తిపాడు ప్రాజెక్ట్‌లోని సీనియర్ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్‌లకు తోటి కార్యకర్తలు సన్మానం చేశారు. బిడ్డకు తొలిగురువు తల్లి అయితే, రెండవ గురువు అంగన్‌వాడీలో ఓనమాలు దిద్దించి ఆటపాటలు నేర్పే తొలి గురువులు అంగన్‌వాడీ కార్యకర్తలేనన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గుంటూరు రూరల్: విశ్వంలో సర్వ మానవాళికి గురువే ప్రత్యక్ష దైవమని పద్మశ్రీ కోట సచ్చిదానంద శాస్త్రి అన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యక్తి ఉన్నత స్థితికి చేరేందుకు గురువే మార్గదర్శకమని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాల కృష్ణ ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ జీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేర్ డెంటల్ కళాశాలలో.

గుంటూరు రూరల్: విద్యార్థి ఉన్నతికి మార్గం చూపే వ్యక్తి గురువేనని కేర్ డెంటల్ కళాశాల చైర్మన్ సయ్యద్ రసూల్ తెలిపారు. మంగళవారం పొత్తూరు గ్రామంలోని కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. అతి చిన్న వయసులోనే ఉపాధ్యాయ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకున్న రాధాకృష్ణన్ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సయ్యద్ రసూల్ దంపతులతో పాటు హెచ్ఓడీలు మహబూబ్, సురేష్ బాబు, నర్సింగ్ కళాశాల హెచ్ఓడీ శోభారాణి తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మొహిద్దిన్, ప్రిన్సిపల్ జాకీర్, జినత్, సమీనా, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

విలువలు నేర్పడం ఉపాధ్యాయుడి బాధ్యత

చేబ్రోలు: ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువుతో పాటు విలువలు కూడా నేర్పించాల్సిన బాధ్యత ఉందని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, జూనియర్ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వీసీ నాగభూషణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా వారి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుడి చేతుల్లో ఉందన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్, అద్దంకి శ్రీనివాస్, ప్రిన్సిపల్ జె.మోహనరావు పాల్గొన్నారు.

ఆర్‌వీఐటీలో..

చేబ్రోలు: విద్యార్థులు రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని చేబ్రోలులోని ఆర్‌వీఐటీ కళాశాల వైస్ చైర్మన్ గొట్టిపాటి మస్తాన్ చౌదరి అన్నారు. ఆర్‌వీఐటీ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మాలెపాటి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రావెళ్ల వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కాకుమాను: స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కెఎఫ్.కెనడీ పాల్గొన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అధ్యాపక వృత్తి నుంచి భారతరత్న పొందిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని ఆయన గుర్తుచేశారు. రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఎంఈఓలు కెనడీ, కె.విజయ్ భాస్కర్‌లను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీ రామ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వివా వీవీఐటీలో..

పెదకాకాని: మనిషిని మహోన్నత వ్యక్తిగా తీర్చిదిద్దేది గురువేనని కోరుకొండ సైనిక స్కూల్ విశ్రాంత ఉపాధ్యాయుడు డి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని వివా ది స్కూల్, వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఐటీ ఖరగ్‌పూర్ విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ కె.విజయ్‌కుమార్, కోరుకొండ సైనిక్ స్కూల్ విశ్రాంత ఉపాధ్యాయుడు డి.వేణుగోపాలరావు, వీవీఐటీ సంస్థల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు. విద్యార్థులకు అధ్యాపకులకు పుష్పగుచ్ఛాలు అందించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు డి.వేణుగోపాలరావును కోరుకొండ సైనిక స్కూల్ పూర్వ విద్యార్థులు సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కోరుకొండ సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థి విభాగం సభ్యులు, వీవీఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, వివా ప్రిన్సిపల్ సీహెచ్ సరళ, వివా డైరెక్టర్ ఎల్‌టీ కమాండర్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిబార్ దంత వైద్య కళాశాలలో..

పెదకాకాని: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్ని సిబార్ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ అన్నారు. తక్కెళ్ళపాడులోని కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సత్కరించి, ఆశీస్సులు పొందారు. డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెదకాకానిలో ఎంఈఓకు సన్మానం



పెదకాకాని పాఠశాలలో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంఈఓలకు సన్మానం

పెదకాకాని: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగల శక్తి ఉపాధ్యాయులకే ఉందని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి అన్నారు. పెదకాకాని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం గురుపూజోత్సవం నిర్వహించారు. విద్యార్థులు గురువులను సన్మానించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంఈఓ బలరామ్‌ను ఘనంగా సత్కరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పొన్నూరు: గురు పూజోత్సవం సందర్భంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన సభకు ఎంఈఓ రుద్రపాటి శోభాచంద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ బి.పద్మలీల పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు సీహెచ్ ఉషారాణి, ఆర్.అనిత, పి.షెబీ కుమారి, ఎస్.నాగవేణి, కె.విజయ లావణ్య, కె.సరళ కుమారి, టీఆర్ లక్ష్మీ పావని, టి.ఇందిరాదేవి, షేక్.ఫర్హానా, సుశీల, సౌభాగ్యమ్మ, ఎం డీ అర్షతున్నీసా, నందిని, ఎస్.జార్జ్, పి.నరేష్ కుమార్, బి.రామారావుకు మెమెంటోలు బహూకరించి, ఘనంగా సన్మానించారు. అతిథులను సత్కరించారు. ఎంఈఓ కె. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని యూనియన్ నాయకులు మల్లంపాటి వెంకటేశ్వర్లు, బి.హనుమంత ప్రసాద్, కె.భావన్నారాయణ, ఎన్ హరిప్రసన్న, వై.వినుకొండయ్య పర్యవేక్షించారు.



సన్మాన గ్రహీతలతో ఎంఈఓలు



అలరించిన సిబార్ దంత కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు



ఆర్‌వీఐటీలో జరిగిన వేడుకల్లో వైస్ చైర్మన్, ప్రిన్సిపల్



ఎంఈఓ కెనడీను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



నంబూరు వివా, వీవీఐటీలో వేణుగోపాలరావును సత్కరించిన చైర్మన్



విజ్ఞాన్ వర్శిటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రిజిస్ట్రార్

పోషకాహారమే.. ఆరోగ్యానికి రక్ష

- నమతుల్య పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం
- పప్పు దినుసులు, ఆకుకూరలతో రక్త హీనతకు చెక్
- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 'పోషణ మాసోత్సవం'

ప్రత్తిపాడు: తల్లులు, పిల్లలు సమతుల పోషకాహారాన్ని ఎంత ఎక్కువగా తీసుకుంటే అంత ఆరోగ్యంగా ఉంటారు. మాంసకృతులు సరైన మోతాదులో లేకపోయినా, విటమిన్లు, ఖనిజలోపాలు అధికంగా ఉన్నా అనారోగ్య సమస్యలు తలెత్తక తప్పవు. కాల్షియం తగ్గితే ఎముకల్లో పటుత్వం పోతుంది. రోగనిరోధక శక్తి పెరగాలంటే పోషకాహారం తప్పనిసరి. కానీ పోషకాహారంపై సరైన అవగాహన లేకపోవడంతో రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. అందుచేత పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలోని 140 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోషకాహారంపై సమగ్ర కథనం.

నెల రోజులు ఏమేం చేస్తారంటే..

- నెల రోజుల కార్యక్రమాల్లో భాగంగా మొదటి వారం తల్లిపాల ప్రాముఖ్యత, చిన్నారుల పెరుగుదల పర్యవేక్షణ చేపడతారు.
- రెండవ వారం ప్రీ-స్కూల్ ప్రాముఖ్యత, చిరుధాన్యాలు, పెరటి తోటల పెంపకం, యోగా, స్థానికంగా లభించే ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి వివరిస్తారు.
- మూడవ వారం నా దేశం – నా మట్టి, మొక్కలు నాటుతారు.
- నాల్గవ వారం రక్తహీనత ఉన్న గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తారు. అన్నప్రాసన, ప్రీస్కూల్ సంసిద్ధత, తక్కువ ఖర్చుతో పోషక విలువలున్న ఆహారం, చిరుధాన్యాలు, పరిసరాల పరిశుభ్రత, పరిశుభ్రమైన నీరు, పోషక విలువలు కోల్పోకుండా వంట చేసే విధానాలపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పిస్తారు.



పోషకాహారం పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ప్రత్తిపాడు ప్రాజెక్టు వివరాలు..

ప్రాజెక్టు:	ప్రత్తిపాడు
మండలాలు:	ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరురూరల్
అంగన్‌వాడీ కేంద్రాలు:	223
మినీ అంగన్‌వాడీ కేంద్రాలు:	03
గర్భిణులు:	1,159
బాలింతలు:	893
3 ఏళ్లలోపు చిన్నారులు:	4,946
3- 6 ఏళ్ల చిన్నారులు:	4,352

మహిళల్లో చైతన్యానికి కృషి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నాం. మహిళలకు సమతుల పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. మాసోత్సవాల్లో భాగంగా అందుబాటులో ఉండే ఆహార పదార్థాలతో తక్కువ ఖర్చుతో పోషక విలువలు ఎందులో అధికంగా ఉంటాయో వంటకాలు చేసి ప్రదర్శిస్తాం. మహిళలు, ప్రజలను చైతన్య పరుస్తాం.

– వి. సుజాతదేవి, సీడీపీవో, ప్రత్తిపాడు ప్రాజెక్టు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కర్లపాలెం: తుమ్మలపల్లి పంట కాలువలో గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మంగవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. సుమారు 55 ఏళ్ల వయస్సు గల ఓ మహిళ మృతదేహం తుమ్మలపల్లి గ్రామంలోని పంట కాలువలో నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిందన్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశామన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామని తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 9440900870 నంబరుకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి

కర్లపాలెం: సాగునీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు ఆరుతడి పంటల సాగు చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాగునీటి లభ్యతపై ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కె.డబ్ల్యూడీ పరీవాహక ప్రాంతంలో చివరి భూములకు సాగునీరు సక్రమంగా అందని కారణంగా ఆ ప్రాంతంలోని రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. ఇప్పటికే నాటిన వరి పొలాలకు వారబందీ పద్ధతిలో సాగునీరందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 7,680ఎకరాలలో వరిసాగు చేశారని చెప్పారు. మిగిలిన రైతులు తమ పొలాల్లో మినుము, పెసర లేదా చిరుధాన్యాలు సాగు చేయాలని సూచించారు.

ఇంటింటి ఓటరు సర్వేను సక్రమంగా నిర్వహించాలి

పొన్నూరు: పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఇంటింటి ఓటరు సర్వేను సక్రమంగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై. హరిహరనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఓటరు సర్వేపై నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటరు సర్వే పై పలు ఫిర్యాదులు చేశారు. హరిహరనాథ్ మాట్లాడుతూ నూతన ఓటర్లకు సంబంధించి 6,7,8, ఫారమ్స్, వెరిఫికేషన్ తదితర అంశాలను అధికారులు పర్యవేక్షించాలన్నారు. మరోసారి జరిగే సమావేశంలో ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా ఓటరు సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహమ్మద్, తహసీల్దార్లు శ్రీకాంత్ గోపాలకృష్ణ, రత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే..

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో జరుగుతున్న ఓటరు వెరిఫికేషన్‌ను బీఎల్‌వోలు పారదర్శకంగా నిర్వహించాలని పొన్నూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి హరిహరనాథ్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వెరిఫికేషన్ రిపోర్టును బూత్ లెవల్ ఏజెంట్‌లకు చూపాలన్నారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, సెక్రటరీలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను ఆదుకోవాలి

రేపల్లె: రుణాలు ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పి డ్వాక్రా మహిళలను మోసగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం డ్వాక్రా మహిళలు ఎస్ఐ అబ్దుల్ రజాక్‌కు ఫిర్యాదు చేశారు. తీసుకోని రుణాలకు తిరిగి సొమ్ము చెల్లించాలంటూ బ్యాంకుల నుంచి నోటీసులు మహిళలకు అందాయన్నారు. రుణాలు ఇప్పిస్తామంటూ వారి నుంచి ఆర్పీలు, కొంత మంది ఆధార్ తదితర పత్రాలు పొంది బ్యాంకర్ల నుంచి కోట్ల రూపాయల సొమ్మును తీసుకున్నారని పేర్కొన్నారు. బ్యాంకుల నుంచి నోటీసులు అందటంతో విషయం తెలుసుకున్న మహిళలు ఆందోళనకు గురయ్యారని చెప్పారు. అక్రమంగా రుణాలు పొందిన వారిపై కేసులు నమోదు చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్పీలు, ఇతర అధికారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, ఐద్వా కార్యదర్శి షేక్ ఆశ, గౌరవాధ్యక్షురాలు నాగమణి, నాయకులు షబానా సుల్తానా, గౌసే, నాంచారమ్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.



పట్టణ ఎస్ఐ అబ్దుల్‌రజాక్‌కు సమస్యను వివరిస్తున్న సీఐటీయూ, ఐద్వా, డ్వాక్రా మహిళలు

నూతన పింఛన్లు పంపిణీ

పొన్నూరు: మామిళ్లపల్లి గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సర్పంచ్ యానాది రావు 14 మంది లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ , సచివాలయం సిబ్బంది, వలంటీర్స్ పాల్గొన్నారు.